ప్రజాశక్తి

5

బుధవారం 22 జనవరి 2025

అల్లూరి సీతారామరాజు

కలెక్టర్ పేరుతో ఫేక్ అకౌంట్

స్పందించి నష్టపోకండి : దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేరుతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన మోసగాళ్లు ఒక ఫేక్ ఖాతాను సృష్టించినట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ౦9779748339144 నంబర్తో సష్టించిన ఖాతా పూర్తిగా మోసపూరితమైనదని, ఆ నంబర్ ద్వారా డబ్బులు అడగటం లాంటి మోసపూరక చర్యలు జరుగుతున్నాయని, ఎవరికి ఎటువంటి నగదు బదిలీ చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ నంబర్ నుండి వచ్చిన కాల్స్ కు, మెసేజ్ లకు ఎవరూ స్పందించరాదని కలెక్టర్ సూచించారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఆ నెంబర్కు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని..

గిరిజనుల ఆందోళన

నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- అరకులోయరూరల్ :రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపంతో నిర్మించిన కొన్నిరోజులకే రోడ్డు మరమ్మతులకు గురైందని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గెమ్మెల చిన్నబాబు పేర్కొన్నారు. మంగళవారం రోడ్డును మరమ్మతు చేపట్టాలని పిరిబంధ గ్రామంలో గిరిజనులు ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చిన్న బాబు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ, అరకులోయ మండలం సుంకరమెట్ట నుండి కటికి వాటర్ ఫాల్స్ వరకు నిర్మించిన రోడ్డు పనుల్లో గుత్తేదారులు పనుల్లో నాణ్యత లోపించడంతో కొన్ని రోజులకే మరమ్మతులు గురైందన్నారు.గతంలో మండల సర్వసభలో ఈ రోడ్డు మరమత్తులు చేసి రోడ్డు సమస్యను పరిష్కారం పరిష్కరించాలని పిర్యాదు చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నుండి ఎటువంటి స్పందన లేదని మండిపడ్డారు. ఈ రోడ్డుపై కటికి వాటర్ ఫాల్స్ కు నిత్యం పర్యటకులు, గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు.. రోడ్డు మరమ్మతుకు గురి కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.దీనిపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి సుంకరమెట్ట నుండి కటికి వాటర్ ఫాల్స్ వరకు రోడ్డును మరమత్తులు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెసా కార్యదర్శి సాయి, పెసా అధ్యక్షులు దేవరాజు ,గ్రామస్తులు పి నర్సు, కె రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఖాళీలను స్థానికులతోనే భర్తీ చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నేత అప్పలనర్స డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు:ప్రభుత్వ మెడికల్ కళాశాలలో స్థానిక ఆదివాసీ యువతతోనే ఖాళీలు భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాడేరు మెడికల్ కళాశాల లో పోస్టు భర్తీ చేయడానికి జారీ చేసిన నోటిఫికేషన్‌లో 244 పోస్టు ఉన్నాయని పేర్కొన్నారు. నూరు శాతం రిజర్వేషన్ పై రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ చేయకపోవడంతో కేవలం 39 పోస్టులు రాష్ట్రం లో ఉన్న ఆదివాసీలకు కేటాయించారని, 244 పోస్టులకు సుమారు 15వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. . పాడేరు లో మెడికల్ కళాశాల రావడంతో ఉద్యోగం పై ఆశలు పెంచుకున్న ఆదివాసీ యువతకు తీవ్ర మైన అన్యాయం జరుగుతుంటే స్థానిక ఆదివాసీ ప్రజా ప్రతినిధులు మౌనం వహించడం సరికాదని అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు కావడం వల్ల ఇప్పటికీ సుమారు 2వేల మంది యువతకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఆదివాసీ లపై కేవలం సవతి తల్లి ప్రేమ మాత్రమే చూపిస్తున్న ప్రభుత్వం చిత్తశుద్ధి ఉంటే తక్షణమే నూరు శాతం రిజర్వేషన్ పై రాష్ట్ర క్యాబినెట్ లో తీర్మానం చేసి అసెంబ్లీ లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు.. ఈ సమావేశంలో ఎస్.సుందర రావు, దాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

బాల సంజీవిని కిట్లు సకాలంలో అందజేయాలి

- సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి రంపచోడవరం

ఏజెన్సీలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత లేకుండా ప్రభుత్వం ఐదు రకాల వస్తువులతో అందిస్తున్న బాల సంజీవిని కిట్లు సకాలంలో అందజేయాలని సంబంధిత అధికారులను రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో డివిజన్ పరిధిలోని ఏడు మండలాల సిడిపిఓలు, అంగన్వాడి సూపర్వైజర్లు, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో మంగళవారం సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు, పాలు, ఏకే తేదీల్లో వెండర్లు తీసుకొస్తున్నదీ, లబ్ధిదారులకు ఏ విధంగా సరఫరా చేస్తున్నదీ సిడిపిఓల అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని బాల బాలికలకు ఆటపాటలతో పౌష్టికాహారం అందించాలని, చదువు చెప్పాలని సూచించారు. ఏజెన్సీలో బాల్యవివాహాలను నిర్మూలించే బాధ్యత సంబంధిత సచివాలయాల మహిళా పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు నిర్మూలన కొరకు బాల బాలికలకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆమె సూచించారు. బాలికలకు 21 సంవత్సరాలు వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడతారన్న విషయం వారికి తెలియజేయాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే కేసులు నమోదు చేసే విధంగా సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ప్రజలకు ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సచివాలయాల ద్వారా వివిధ రకాలైన సేవలు ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపివోలు సంధ్యారాణి, లక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, దేవమణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పి.ప్రకాష్ కుమారి, సత్యవతి, గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు పాల్గొన్నారు.

2026 మార్చికి గృహ నిర్మాణాలు పూర్తి

-కలెక్టర్ దినేష్ కుమార్- పిఎం జన్ మన్ పురోగతిపై న్యూఢిల్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

ప్రజాశక్తి పాడేరు, : పిఎం జన్ మన్ కింద నిధుల కొరత లేదని, 2026 మార్చి నెలాఖరులోగా అన్ని పివిటిజి గ్రామాలలో అర్హులైన గిరిజనులకు కేటాయించిన గృహ నిర్మాణాలను పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. మంగళవారం కొత్త డిల్లి భారత్ మండపం హాలులో జరిగిన పిఎం జన్ మన్ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లాలో అమలు జరుగుతున్న పిఎం జన్ మన్ పథకంపై వివరించారు. జిల్లాలో పివిటిజిలకు 25,578 గృహాలు అవసరమని గుర్తించడం జరిగిందని, 23,766 గృహాలు మంజూరు కాగా 226 పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. నిర్మాణాలకు ఎదురవుతున్న సమస్యలు, వాటిని అధిగ మించడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమం పై వివరాలను మంగళవారం స్థానిక విలేకరులకు ఒక ప్రకటనలో

మాట్లాడుతున్న కలెక్టర్

పేర్కొన్నారు. 576 రహదారుల నిర్మాణానికి లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, 178 ఆవాసాలకు 146 రహదారులు మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అద్దె భవనాలలో ఏర్పాటు చేసిన 28 అంగన్వాడి కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేశామని, మరో 61 అంగన్వాడి కేంద్రాలు కొత్తగా మంజూరు చేశామన్నారు. జల జీవన్ మిషన్ కింద 1660 పివిటిజి గ్రామాలకు కొళాయి కనెక్షన్ల మంజూరు కాగా 257 గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగు నీటి సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలో 59 మాలి పర్పోజ్ కేంద్రాలు మంజూరు కాగా 27 కేంద్రాల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి. అభిషేక్, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, హౌసింగ్ పిడి ఎ. బాబు పాల్గొన్నారు.

సందర్శిస్తున్న పర్యాటక శాఖ ఎండి అప్రపాలి

టూరిజం రిసార్ట్స్ సందర్శన

ప్రజాశక్తి-అరకులోయ:అరకులోయలోని పర్యాటక శాఖ పున్నమి వ్యాలీ రిసార్ట్స్, హరిత రిసార్ట్స్, అమీబా కాటేజ్ లను రాష్ట్ర పర్యాటక శాఖ ఎండి, సీఈవో అమ్రపాలి మంగళవారం పరిశీలించారు. ముందుగా అనంతగిరి మండలంలో పర్యటించిన అనంతరం అరకులోయకు చేరుకొని ఇక్కడ జరుగుతున్న పనులు, రిసార్ట్స్ మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం పర్యటకశాఖలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఆమెతో మాట్లాడ్డానికి స్థానిక విలేకరులు ప్రయత్నించగా ఆమె నిరాకరించారు. ఎండి, సీఈవో హోదాలో వచ్చి మాట్లాడకపోతే ఎలా మేడం అని ప్రశ్నించగా, తాను మాట్లాడను అనడం లేదని, తన దగ్గర ఆన్సర్ లేదని ఆమె చెప్పి వెళ్ళి పోవడం గమనార్హం.

గర్భిణులు వైద్య పరీక్షలు చేసుకోవాలి

ప్రజాశక్తి-చింతపల్లి:రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలు నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కె సౌమ్య సూచించారు. అల్లూరి జిల్లా ఆరోగ్యశాఖ వైద్యాధికారి ఆదేశాల మేరకు మంగళవారం హెల్త్ సూపర్వైజర్ ఎస్ శాంతకుమారి ఆధ్వర్యంలో బుడతల వేనం గ్రామాన్ని సందర్శించి రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ఆశ కార్యకర్త, ఏఎన్ఎం సలహాలు సూచనలతో ఆసుపత్రికి తరలివెల్లి నిరంతరం వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలను చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఎస్ ప్రకాష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వైద్య బృందాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజనులకు మెరుగైన వైద్యం అందిచేలా చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిను కోరారు. మెడికల్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ హింగోలి, మహారాష్ట్ర, కర్ణాటక డిస్టిక్ హెల్త్ సిస్టం ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ శంకర్రావు, డాక్టర్ రియాజ్ అహ్మద్‌లు మంగళవారం రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే శిరీషాదేవి విజయభాస్కర్ సాదరంగా ఆహ్వానించారు. గిరిజన ప్రజల ఆరోగ్య పరిస్థితులను వివరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా, ఆసుపత్రి అభివృద్ధి కొరకు వారు సహకరించాలని కోరారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా మెడికల్ క్యాంపులు నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ కమిటీ సభ్యులు షేక్ చోటు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీ గంగరాజుపుట్టు జంక్షన్ నుండి గుమ్మడిగండువ, మధలపురం, గంగవరం యు బొద్దపుట్టు వరకు చేపట్టే రోడ్డు పనులకు సర్పంచ్ నైని. సన్నిబాబు, బాకూరు ఎంపీటీసీ నైని. రజని మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తారు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పారావు. ఇంజనీరింగ్ అసిస్టెంట్. ఉదయ్, నాయకులు. నైని. సత్తిబాబు, బి శంకర్, జన్ని. భాస్కర్‌రావు, పి. గణేష్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

తక్షణమే గ్రామ సభలు నిర్వహించాలి

సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకొనేది లేదని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని రేఖపల్లిలో సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు అధ్యక్షతన జరిగిన మంగళవారం జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంతోష్‌కుమార్ మాట్లాడారు. నేటికీ పోలవరం నిర్వాసితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. పూర్తి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా, భూ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ నిర్వాసితులను గందరగోళానికి గురి చేస్తున్నాయని విమర్శించారు. మొదటి కాంటూరు గ్రామాలు విఆర్.పురం మండలంలో 20 ఉన్నాయని, మరో సారి ప్రాధాన్యత గ్రామాలను మొదటి కాంటూర్లో చేర్చుతామని, వారందరికీ ఆర్ అండ్ ఆర్, పునరావాసం కల్పిస్తామని చెప్పి గ్రామసభలు నిర్వహించారని తెలిపారు. కానీ నేటికీ ఆ గ్రామాల పరిస్థితి ఏమిటో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. మొదటి కాంటూర్‌లో ఉన్న 20 గ్రామాలకు పూర్తి ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం, పునరావాసం కల్పించలేదని, అలాంటిది మళ్లీ కలిపిన గ్రామాల ప్రజలకు ఎప్పటికీ పునరావాసం కల్పిస్తారో తక్షణమే ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. 2017లో నోటిఫికేషన్ ఇచ్చి ఇప్పటికీ నష్ట పరిహారం ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకుల పరిస్థితి అంధకారంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మొదటి కాంటూరులో ఎన్ని గ్రామాలను చేర్చారో కచ్చితంగా ప్రకటించి, తక్షణమే అన్ని గ్రామాలలో పోలవరం నిర్వాసితుల గ్రామసభలు నిర్వహించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు, సోయం చినబాబు, తోడం రాజు కొండారెడ్డి, శ్రీరపు తాతబాబు, కమ్మిచిచ్చు సత్యనారాయణ, పోడియం శ్రీరామ్మూర్తి, గుండిపుడి లక్ష్మణరావు, తుర్రం బాబురావు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గృహ బిల్లుల మంజూరుకు వినతి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో పీఎం జన్మన్ పథకం ద్వారా పివిటిజిలకు గృహాల బిల్లులు మంజూరు చేయాలని పివిటిజి సంఘం ప్రతినిధులు స్వాభి రామచందర్, కిల్లో ప్రసాద్, పి.రామారావు, జి శ్రీరాములు, రాంబాబు, జి.జగన్నాథం మంగళవారం పాడేరులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,. మారుమూల పీవీటిజి గ్రామాల్లోఇళ్ల స్థలాలు లేక రెండేసి ఇల్లు జాయింట్ గా నిర్మించుకుంటున్నారని తెలిపారు.హౌసింగ్ శాఖ అధికారులు జాయింట్ గా నిర్మించిన ఇళ్లకు బిల్లు చెల్లించడం కుదరదని హౌసింగ్ అధికారులు చెప్తున్నారని తెలిపారు.మారుమూల పివిటిజి గ్రామాలకు సరైన రోడ్ సౌకర్యం లేక ఇల్లు నిర్మాణానికి కావలసిన సిమెంట్ , ఇరాన్, ఇసుక, సిమెంట్ వంటి ముడి సరుకులు తీసుకెళ్లడానికి రెండు లక్షల 39వేలు రూపాయలు చాలదని ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా 5 లక్షలకు పెంచాలని కోరారు.జాయింట్ గా ఇల్లు నిర్మించుకుంటున్న ఇళ్లకు బిల్లులు అభ్యంతరాలు లేకుండా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ తదితరులు

ప్రజాశక్తి-పాడేరు : పశు సవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేసారు. మంగళవారం జేసి చాంబర్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఉచిత పశు ఆరోగ్య శిభిరాలు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 31వ తేదీ వరకు ఈ పశు వైద్య శిభిరాలు జిల్లా వ్యాప్తంగా 441 కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు జేసి తెలిపారు. పశు వైద్య శిభిరాలలో పశువలకు అవసరమైన చికిత్సలతో పాటు, గర్భాకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందిస్తారని జేసి వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి నరసింహులు, వెటర్నరీ వైద్యులు సృజన, రాజీవ్ కిషోర్ పాల్గొన్నారు.

జిమాడుగుల : మండలంలో వంజరి పంచాయతీ కేంద్రంలో జి.మాడుగుల పశువైద్య అధికారి డాక్టర్ సృజన ఆధ్వర్యంలో మంగళవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పశువులకు టీకాలు, నట్టలు వేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఇన్చార్జి నాయకుడు, వంజరి చిరంజీవి నాయుడు, వెంకట్, కొండబాబు, రఘునాథ్, శ్యాము ప్రవీణు పాల్గొన్నారు

మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వేటుకూరు గ్రామంలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ యు వీరేంద్ర ఆధ్వర్యాన పది ఆవులు, ఎద్దులు, 20 ఆవు దూడలు, 63 మేకలకు బద్దె పురుగు నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో వేటుకూరు పంచాయతీ సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి, టిడిపి సీనియర్ నాయకులు గొర్లె నారాయణ, మండలం పశువైద్య సిబ్బంది, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మల్లీశ్వరి, పశు వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ

షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ : 9490099125	పూర్ణమార్కెట్ : 9490099676
మధురవాడ : 8008596645	జగదాంబ : 9490099434
గాజువాక : 9849392359	జివియంసి : 9490099483
అనకాపల్లి : 8008736188	ద్వారకానగర్ : 9490099672
చోడవరం : 9490099141	కంచరపాలెం : 9490099135
నర్సీపట్నం : 9440280411	మాదవధార : 9490099675
పాడేరు : 9490099142	
రంపచోడవరం : 9440165617	

ఎయులో జపనీస్ డిప్లమో

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం జపనీస్ భాషలో డిప్లమా కోర్సు కోసం ప్రవేశాలను ప్రారంభించింది. ఆసక్తిగల విద్యార్థులు, ప్రజలు ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండవ అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని (9014088901) సంప్రదించాలని విదేశీ భాషల విభాగాధిపతి, జపాన్ సమాచార, అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ సూచించారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయని, ఆరునెలల కోర్సును సాయంకాలం తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాడేరు : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎ పక్కన దేవాలయం ప్రాంగణం లో మంగళవారం ఆటో, జీపు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేసినందుకు జిల్లా రవాణా అధికారి ఎస్ లీలా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, డి వెంకట్‌రావు కంటి వైద్య నిపుణులు, ఆరోగ్య శాఖ, రవాణా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

'సిఎం కృషితో ఉక్కుకు ప్యాకేజీ'

ప్రజాశక్తి -అరకులోయరూరల్: ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషితోనే విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా లభించిందని టీడీపి అరకు ఇన్చార్జి, ఏపిఎస్ఆర్టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర అన్నారు.మంగళవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు విడుదల చేసిన నేపథ్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ను మళ్ళీ పునరుజీవింప చేయడానికి తోడ్పడుతుందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుందని టీడీపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దష్టి సాధించిందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, మాజీ ఎంపిటిసి కుమార్, సుంకర మెట్ట మాజీ సర్పంచ్ పెట్టెలి రాము, పద్మాపురం మాజీ సర్పంచ్ కొర్ర ఓనది పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్ల ఎంపిక

ప్రజాశక్తి- పాడేరు: పిఎం ఫార్మలైజేషన్ అఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పిఎంఎఫ్ఎంఇ) ని సమర్ధవంతంగా అమలు చేయటానికి మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబర్ ఒకటి నాటికి 21 నుండి 30 సంవత్సరాల వయసు కలిగి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత పొంది కంప్యూటర్, ఇంటర్నెట్ లో ప్రావీణ్యం కలిగి, స్వంత స్మార్ట్ ఫోన్ కలిగిన ఆసక్తి గల స్త్రీ, పురుష, ట్రాన్స్ జండర్ అభ్యర్థులు ఆయా మండలంలో ఉన్న వెలుగు కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జేసి సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్, సహజ వనరుల అభివృద్ధి రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశకి-చింతపల్లి:మండలంలోని వాముగడ్డ కొత్తూరు గ్రామంలో గత పది రోజుల వ్యవధిలో వరుసగా ముగ్గురు పసి పిల్లలు ప్రాణాలు కోల్పోయిన తెలిసిన విషయమే. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ అరుకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాంలు వాముగడ్డ గ్రామంలో బాధిత కుటుంబాలకు పరామర్శించారు. మరణాలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించేలాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండల జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు కిముడు కృష్ణమూర్తి, నాయకులు సూర్ల వీరేంద్ర. గాజుల శ్రీను, కృష్ణ, పొట్టుకూరి జయరాజ్ పాల్గొన్నారు.

10 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ నాయుడు తమ సిబ్బందితో కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామ శివార్లలో నాటుసారాం విక్రయాలు జరుగుతున్నట్టుగా సమాచారం మేరకు దాడులు చేశారు. బత్తిన లక్ష్మి అనే మహిళ నుండి 10 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకొని, నిందితురాలిని అరెస్టు చేసినట్లు సీఐ లక్ష్మనాయుడు తెలిపారు. కోర్టు 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.. ఈ దాడులలో అనకాపల్లి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కె ఎస్.గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.

లడక్, కార్గిల్ రైతులకు గీతం టెక్నాలజీ

ప్రజాశక్తి -మధురవాడ: ఏడాది పొడవునా చల్లటి వాతావరణంతో ఉండే లడక్, కార్గిల్ ప్రాంతాలలో ఉద్యాన వన పంటలు, వివిధ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా భద్రపరచడానికి వీలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని గీతం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ (జీ-టెక్) నిపుణులు అభివృద్ధి చేశారు. రైతులు ఉపయోగించే హైబ్రిడ్ సోలార్ డయర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని లడక్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.కె.మెహతాకు జీ-టెక్ కో-ఆర్డినేటర్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు ఇటీవల జరిగిన కార్యక్రమంలో అందజేశారు. జీ-టెక్‌కు చెందిన నిపుణులు డాక్టర్ కెవిఎన్ఎస్ఆర్.చంద్రమౌళి, గీతం విశిష్ట ప్రొఫెసర్ డాక్టర్ గురజాడ రవికుమార్, జీ-టెక్ అధికారి సోంబట్ శాస్త్రి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించారు. తక్కువ వ్యయంతో అయ్యే ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఉష్ణోగ్రతలను నియంత్రించే సెన్సార్లు, పగటి పూట సూర్య రశ్మిని గ్రహించి సోలార్ సెల్స్ ద్వారా రాత్రి సమయంలోను తగు ఉష్ణోగ్రత మధ్య పంటలను సంరక్షించే పరిజ్ఞానం ఉపయోగించినట్లు వారు తెలిపారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఆహార ఉత్పత్తుల రంగు, రుచి, వాసనలలో ఏవిధమైన మార్పులు ఉండవని పేర్కొన్నారు. దీంతో లడక్, కార్గిల్ ప్రాంతాలలో అధికంగా పండే ఆప్రికాట్ ఇతర పండ్లను తేమ లేకుండా పొడి బారేటట్లు చేసి దీర్ఘకాలం నిల్వ చేసుకోవచ్చని వారు వెల్లడించారు.

లడక్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.కె.మెహతా మాట్లాడుతూ, సరైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేక లడక్ ప్రాంత రైతులు పంట దిగుబడిలో 60 శాతం వరకు కోల్పోతున్నారని పేర్కొన్నారు. గీతం నిపుణులు రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం దిగుబడి అయిన పంటలలో తేమ వల్ల జరిగే నష్టాలను నివారించి నాణ్యతతో కూడిన ఎగుమతులకు మార్గం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలలోని పరిశోధన ఫలితాలు క్షేత్ర స్థాయిలో ఈ విధంగా ఉపయోగపడటం అభినందనీయమన్నారు. జీ-టెక్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ, ఇటీవల మిజోరాం రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం టిబిఐ డివిజన్ శాస్త్రవేత్త డాక్టర్ బి.కృష్ణకాంత్, అకాడమి ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ సంజయ్ కుమార్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబిలింగ్ సెంటర్ నిపుణులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్.రాజగోపాల్, డాక్టర్ బి.సునీల్, గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి రవికుమార్ శ్రీవత్స, జీ-టెక్ అసిస్టెంట్ మేనేజర్ అలేఖ్య మారం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న దొన్నుదొర తదితరులు

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ వెంకన్న ఆలయ ప్రాంగణంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి మంగళవారం ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, టిడిపి అరకు నియోజకవర్గం ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, పెదలబుడు మేజర్ పంచాయితీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు బాల గణేష్ స్థల పరిశీలన జరిపారు. గత కొన్ని నెలలుగా అరకులోయలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించేందుకు ఆర్యవైశ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొల్లా రమేష్, రంగా, వెలగా గుప్త, కాపుగంటి గుప్తా, పొట్ట ప్రకాష్, కొల్లా ప్రసాద్, భాస్కర్, గుణేశ్వరావు పాల్గొన్నారు.

స్టీల్ రిటైర్మెంట్ ఉద్యోగులు..

మెడికల్ ఇన్స్యూరెన్స్‌లో మార్పులు తగవు

ప్రజాశక్తి -ఉక్కునగరం : ఉద్యోగ విరమణ చేసిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మెడికల్ ఇన్స్యూరెన్స్ జిఐఎంఎస్, పిఆర్ఎంఎస్ స్కీములో చేస్తున్న మార్పులను రిటైర్డ్ ఉద్యోగులు ఖండించారు. అగనంపూడి సిడబ్ల్యుసిలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగులు మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి ఎలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, రిటైర్మెంట్ ఉద్యోగులకు విఘాతం కలిగించే మార్పు చేస్తున్నారన్నారు. ప్రస్తుత మెడికల్ ఇన్స్యూరెన్స్ విధానంలో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగికి ఏటా రూ.1300, భార్యకి రూ.1300 మొత్తం 2600 చెల్లిస్తే రూ.ఆరు లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నారని తెలిపారు. బయట కొనుక్కొనే మందులకు రూ.16 వేలు ఇస్తున్నారని వివరించారు. కొత్త విధానం ప్రతిపాదనలలో భార్యాభర్తలకు కలిపి రూ.20 వేలు మెడికల్ ఇన్స్యూరెన్స్ కట్టాలని, బయట కొనుక్కొనే మందులకు తిరిగి చెల్లింపు నిమిత్తం మనిషికి రూ.4 వేలు చొప్పున భార్యాభర్తలకు రూ.8 వేలు ఇవ్వాలని ప్రతిపాదన చేశారని తెలిపారు. ధరల ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న సమయంలో ఇటువంటి చర్యలకు స్టీల్ సిఎండి శరత్ కుమార్ సక్సేనా ప్రతిపాదనలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు విఘాతం కలిగించే ప్రతిపాదనలు విరమించుకొని పాత పద్ధతిలోనే ఆర్ఐఎన్ఎల్ గ్రూప్ మెడికల్ స్కీము కొనసాగించాలని కోరారు. దీనిపై అఖిలపక్ష యూనియన్లు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని కోరారు. గుడే సుశీల గజేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాయిన సన్యాసిరావు (ఏఐటియుసి), మరిసా రామచంద్రరావు (ఐఎన్‌టియుసి), వై.ఎర్రయ్య (సిఐటియు), స్టీల్ మాజీ ఉద్యోగులు వింధుల వరహాలు, కొలిపాక అప్పారావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన బాధితులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి:జాతీయ రహదారి 516 ఇ రోడ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం అంతర్ల గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన కొర్ర రాజు బాబు, కిలో నరసింహారావు ద్విచక్ర వాహనంపై అంతర్ల పెంటపాడు వైపు వెళ్తున్నారు.గ్రామ సమీపంలో ఆదివాసి ట్రస్టు కూడలి వద్ద నిలబడి ఉన్న ఆదివాసి ట్రస్ట్ సభ్యుడు, గూడెం కొత్త వీధి మండలం గాలికొండ పంచాయితీ ఆకులూరి పనసపల్లి గ్రామానికి చెందిన కోరాబు బాలయ్యను బలంగా ఢీకొట్టడంతో బాలయ్య కుడికాలు విరిగిపోయింది. వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యాధికారులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం విశాఖపట్నం కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-అరకులోయ:మండలంలోని సుంకరమెట్ట లోని మోడల్ కాలనీలో విద్యుత్ షాక్ కు గురై గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డారు. గత కొన్నేలుగా సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద మోడల్ కాలనీలో నివాసం ఉంటున్న గెమ్మెలి ప్రసాద్ అనే గిరిజనుడు కరెంట్ వేయడానికి మోడల్ కాలనీలోని ఓ స్తంభానికి ఎక్కాడు. పక్కనే ఉన్న తీగలో కరెంటు సప్లై ఉండడంతో షాక్ తగిలి అక్కడికక్కడే పడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనకు అరకులోయ ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో విశాఖ కేజిహెచ్‌కు తరలించారు.

29 నుంచి గీతంలో ఎక్స్‌లెన్స్ మీట్

ప్రజాశక్తి -మధురవాడ : వాణిజ్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను వెలికి తీయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ మూడు రోజుల పాటు నిర్వహించే గీతం ఎక్స్‌లెన్స్ మీట్ (జెమ్)- 2025ను ఈ నెల 29, 30, 31 తేదీలలో నిర్వహిస్తున్నట్లు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు తెలిపారు. మంగళవారం జెమ్-2025 ఆహ్వాన కమిటీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో జెమ్ వివరాలను వెల్లడించారు. జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి మాట్లాడుతూ, గత 30 సవత్సరాలుగా "జెమ్"ను జాతీయ స్థాయిలో నిర్వహిస్తూ వస్తున్నామని, ఎందరో విద్యార్థుల ప్రతిభకు వేదికగా జెమ్ నిలిచిందని చెప్పారు. ఈ ఏడాది "సామర్థ్య" పేరిట నిర్వహిస్తున్న జెమ్-25 యువజనోత్సవాన్ని "భవిష్య యువతను నాయకత్వ లక్షణాలతో బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశంగా వివిధ కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానవ వనరుల ప్రాధాన్యతను, సంస్థల నిర్వహణలో హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ల ప్రాధాన్యతను తెలిపేలా 29వ తేదీన చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్స్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 30, 31 తేదీలలో విద్యార్థులకు వాణిజ్య అంశాలపై వర్క్‌షాప్‌లు, సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెమ్-25 చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.మిశ్ర మాట్లాడుతూ, విద్యార్థుల్లో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను వెలికి తీసే విధంగా వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెమ్-25 కో సిఇఒ కె.చెర్రి హేడ్స్ మాట్లాడుతూ, క్రికెట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు నగదు బహుమతులను, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విద్యార్థుల ఆధ్వర్యాన ఫ్యాషన్‌షో, రాక్‌బాండ్, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నో అనర్థాలకు దారితీసే ప్లాస్టిక్ వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని, విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అధికారులు, ప్రజలు పరస్పర సహకారంతో మెలగాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధం, ఇతర కార్యాచరణపై జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, డిసిపి అజిత, ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ మహమ్మారి వల్ల కలిగే దుష్ప్రయోజనాలను గుర్తించాలని, దానికి దూరంగా ఉంటే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు పాటించాల్సిన పద్ధతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 45 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, పెద్దపెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, మద్యం దుకాణాలు, పర్యాటక ప్రాంతాలు తదితర చోట్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని, సంబంధిత సర్క్యులర్లను కింది స్థాయి కార్యాలయాలకు పంపించాలని జిల్లా స్థాయి అధికారులకు తెలిపారు. ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా అంకిత భావంతో అందరూ వ్యవహరించాలని సూచించారు. ఆటోలు, బస్సుల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖ డెయిరీ ఉత్పత్తుల ద్వారా విక్రయించే కవర్లను వినియోగదార్ల నుంచి మళ్లీ తిరిగి సేకరించాలని డెయిరీ అధికారులకు చెప్పారు. అవగాహన ద్వారా మార్పు తెచ్చేందుకు ప్రయత్నం చేయాలని, అప్పటికీ మార్పు రాకపోతే జరిమానాలు వేయాలని, కేసులు పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి సిఎంఒ సురేష్, జోనల్ కమిషనర్లు, నేవీ, పోలీసు, పరిశ్రమలు, విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం డివిజన్ పరిధిలో అక్రమ కట్టడాలు ఆగటం లేదని, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు తెలిపారు. 1/70 చట్టం అమలులో ఉన్నా అడ్డతీగల మండల కేంద్రం, డి.భీమవరం, దుప్పులపాలెం గ్రామాలలో గిరిజనేతరులు కొన్ని నెలలుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. వాటిని నిలుపుదల చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ సచివాలయం స్థాయి నుండి, సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్థాయి వరకు ఎన్నో ఫిర్యాదులు ఇచ్చామని తెలిపారు. అయినా సదరు అధికారులు నేటికీ ఏఒక్క అక్రమ కట్టడంపైనా చర్యలు చేపట్టలేదన్నారు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏజెన్సీలో చట్టాలు ఎలా అమలు జరుగుతాయని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అతిక్రమించి జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, అడ్డతీగల నాయకులు పీఠ ప్రసాద్ పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌పై వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిపిఎఫ్ఒ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం హయ్యర్ పెన్షన్ కేసుల ప్రాసెస్‌ను వేగవంతం చేయాలంటూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఎపిఆర్‌పిఎ) రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్‌రావు, జిల్లా అధ్యక్షులు దీనబంధు, ఎఐసిసి సభ్యులు కుమార్ మంగళం, జిల్లా కమిటీ సభ్యులు నారాయణరావు ఆర్‌పిఎఫ్‌ఒకు వినతిపత్రం అందజేశారు.

ఫార్మాలో భయం.. భయం

మెట్రో కెమ్‌లో అగ్ని ప్రమాదంతో భీతిల్లిన ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు

విచారణకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పరవాడ, అనకాపల్లి విలేకరులు

పరవాడ ఫార్మా సిటీలోని మెట్రో కెమ్ ఎపిఐ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్ - 4లో మంగళవారం ఉదయం సుమారు 6:40 గంటల సమయంలో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంతో మళ్లీ ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. పెద్ద పెద్ద అగ్నికీలలు, దట్టమైన పొగ ఆ ప్రాంతమంతటా ఆవరించడంతో కంపెనీ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల్లోని కార్మికులు, చుట్టుపక్కల గ్రామాలైన తానాం, తాడి వాసులు భీతిల్లారు. తరుచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటం పట్ల వారు తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. గత నవంబర్‌లో ఇదే కంపెనీలో ప్రమాదం జరిగింది. మూడు నెలలు గడవక ముందే మరలా మంగళవారం అగ్ని ప్రమాదం జరగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కంపెనీ భద్రతా చర్యల అంశం తెరపైకి వచ్చింది.

మెట్రో కెమ్‌లో ప్రమాద స్థలాన్ని చూపుతున్న లోకనాథం

అసలేం జరిగింది ?

మెట్రో కెమ్ యూనిట్ - 4లో ఇటిపి ట్యాంకులు మూడో అంతస్తులో ఉన్నాయి. రెండు, మూడు రోజులు అక్కడే వేస్ట్ కెమికల్‌ను స్టాక్ చేశారు. వాటిపై సాల్వెంట్ పడటంతో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. విషయం తెలియడంతో రాంకీ అగ్నిమాపక సిబ్బంది కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రమాదం వల్ల ఎటువంటి ప్రాణనష్టమూ జరగనప్పటికీ ఫార్మా కంపెనీల్లో లోపభూయిష్టతను తాజా ఘటన ఎత్తిచూపింది. ఘటనా స్థలాన్ని పరవాడ డిఎస్‌పి వి.విష్ణు స్వరూప్, సిఐ మల్లికార్జునరావు సందర్శించి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంఘటనపై విచారణకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు జారీ చేశారు ప్రమాద ఘటనపై దర్యాప్తు అనంతరం నివేదిక సమర్పించనున్నట్టు జిల్లా పరిశ్రమలు జనరల్ మేనేజర్ జి.నాగరాజారావు తెలిపారు.

సమగ్ర విచారణ జరపాలి : సిపిఎం

మెట్రో కెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావులు డిమాండ్ చేశారు. మంగళవారం తెల్లవారు కంపెనీ ఇటిపి ప్లాంట్‌లో ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు అక్కడకు చేరుకున్నారు. కంపెనీలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతోందని, లాభాలే పరమావధిగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి తప్ప కార్మికుల ప్రాణాలను పట్టించుకోవడం లేదని అన్నారు. నవంబర్‌లో ఇదే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని, అప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకొని వుంటే ఈ ప్రమాదం సంభవించేది కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా వుండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆ కమిటీలు ఇచ్చిన నివేదికలను బహిర్గతం చేసి, ప్రమాదాలకు కారణమైన కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇప్పుడు చిన్న చిన్న ఫార్మా కంపెనీల్లోనే ప్రమాదాలు అరికట్టలేని ప్రభుత్వాలు నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పేరుతో వచ్చే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ప్రమాదాలను ఏ విధంగా అరికట్టగలవని ప్రశ్నించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రమాదాలకు కారణమైన కంపెనీపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భద్రత డొల్ల : సిఐటియు

మెట్రో కెమ్‌లో ప్రమాదంతో ఫార్మా కంపెనీల్లో భద్రతా డొల్ల మరోసారి బహిర్గతమైందని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు అన్నారు. భద్రతా ప్రమాణాలను పాటించని సదరు కంపెనీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 2న ఇదే పరిశ్రమలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వందలాది కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని చెబుతున్నారని, కార్మికులకు భద్రత పాటించని యాజమాన్యాలపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌టిసికి రూ.2 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి సందర్భంగా ఎపిఎస్ ఆర్‌టిసి విశాఖపట్నం ప్రత్యేక బస్సులను నడపగా రూ.2 కోట్లు ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి అదనపు ఛార్జీలూ లేకుండానే బస్సులను నడిపామన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్ స్టేషన్ నుండి సంక్రాంతి స్పెషల్ బస్సు సర్వీసులను పండగకు ముందు సుమారు 1100, ఆ తరువాత 300 ప్రయాణికుల సౌకర్యార్థం తిప్పామన్నారు. విజయనగరం జోన్‌లో సుమారు 2000 సర్వీసులను ద్వారకా బస్ స్టేషన్ నుంచి నడిపామని తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుండి రైళ్లలో వచ్చిన వారిని ద్వారకా బస్ స్టేషన్ నుంచి వారి ప్రాంతాలకు పంపించామన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, చిత్రంలో పల్లా శ్రీనివాసరావు తదితరులు

విశాఖ ఉక్కుపై వైసిపి తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్యాకేజీ వచ్చేలా చేసి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడామని, గత వైసిపి ప్రభుత్వం ప్లాంట్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి స్టీల్‌ప్లాంట్ వల్ల సాధ్యమవుతుందన్నారు. గత వైసిపి పాలనలో కేవలం భూ దోపిడీ కోసం మాత్రమే స్టీల్‌ప్లాంట్ వ్యవహారం నడిపారని ఆరోపించారు. దేశంలో గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో నిలువనుందని తెలిపారు. అనకాపల్లిలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ కోసం ఆర్సెలార్ మిట్టల్‌తో సిఎం చంద్రబాబు దావోస్‌లో ఎంఒయు చేసుకున్నారన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం విశాఖలో భూములు కొట్టేసిందన్నారు. దసపల్లా, వాల్తేరు క్లబ్ భూములు కూడా కొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. విశాఖకు త్వరలో టిసిఎస్, గూగుల్ సంస్థలు వస్తున్నాయని చెప్పారు. పోలవరం పనులు ఇక వేగంగా జరుగుతాయన్నారు. ఏటా పది వేల క్యూసెక్కుల నీళు అందించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు చంద్రబాబు పునరుత్తేజం తెచ్చారని అన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను జగన్ అమ్మేశారన్నారు. సమావేశంలో రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, రాష్ట్ర రోడ్లు భవనాలు చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారుగూడెం-జల్లివారిగూడెం వాగుపై

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని మడివిగుంపు, పీసంగుంపు, బంగారు గూడెం, జల్లివారిగూడెం మధ్యలో ఉన్న వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జల్లివారిగూడెంలో సిపిఎం నాయకులు కుంజ రాజయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో చిన్నబాబు మాట్లాడుతూ ఈ బ్రిడ్జి కోసం ఇప్పటికే అనేకసార్లు ఐటిడిఎ, ఇంజనీరింగ్ అధికారులకు విన్నవించామని, అయినా ఎటువంటి పురోగతి కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి సిసి రోడ్లు, ఇంటర్నల్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఒకపక్క ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్నా, ఆచరణలో మాత్రం అటువంటి పరిస్థితి కానరావడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకొని వెంటనే హైలెవెల్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కమ్మిచిచ్చు సత్యనారాయణ, జల్లి సత్యనారాయణ, శాఖ కార్యదర్శి మోసం సత్యనారాయణ, ఉప సర్పంచ్ జల్లి చిన్నతమయ్య, జల్లి నరేష్, మాజీ ఎంపీటీసీ కుంజ అర్జమ్మ, కుంజా రోజా, కుంజ బొజ్జి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టయింది. ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు విశాఖ సిపి డాక్టర్ శంకబ్రత బాగ్చి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందన్నారు. కొన్ని విషయాలను పబ్లిక్‌గా చెప్పలేమని, పెద్ద తలకాయలు ఉన్నాయని అన్నారు. అందరినీ కచ్చితంగా పట్టుకుంటామన్నారు. క్రికెట్ బెట్టింగ్ ముఠాతో సంబంధం ఉన్న ఓ హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేశామని, విచారణ జరుగుతోందని తెలిపారు. ముఠాతో సంబంధాలు ఉన్న వారి 80 బ్యాంకు ఖాతాలను, రూ.45 లక్షల నగదును సీజ్ చేశామన్నారు.